క్లుప్తంగా

ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నేతలు

విజయపురం: స్థానిక ఎస్టీ కాలనీలో ఈనెల 29వ తేదీన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు కొల్పోయిన అశోక్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నేతలు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. 25కేజీలు బియ్యం, రెండు కేజీల చెక్కెర, పప్పుతో పాటు రూ. 8వేల నగదు అందజేశారు. మండల కన్వీనర్ గోపినాథ్, ఎంపీటీసీ రాజ్‌గోపాల్, నేతలు శివరాజు, ప్రసన్న, మునిరెడ్డి పాల్గొన్నారు.

నాడు-నేడుపై సమీక్ష



సమీక్షలో మట్లాడుతున్న ఎంఈఓ

నింద్ర: మండలంలో నిర్వహిస్తున్న మనబడి నాడు-నేడు రెండవ దశ పనులపై శనివారం సంబంధిత ఉపాధ్యాయులతో ఎంఈఓ శ్రీధర్ రాజు సమీక్ష నిర్వహించారు. సమీక్ష స్థానిక ఎమ్మార్సీ భవనంలో జరిగింది. ఆయన మట్లాడుతూ తమ పరిధిలో ఉన్న నాడు-నేడు పనులు పూర్తిచేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలన్నారు.

శిక్షణకు హాజరుకండి

గంగాధరనెల్లూరు: చిత్తూరు జెడ్పీ మీటింగ్ హాలులో ఈనెల 4, 5 తేదీల్లో జరిగే ఎన్నికల శిక్షణకు హాజరుకావాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఆయన మట్లాడుతూ ఈనెల 4వ తేదీ నియోజకవర్గంలోని సెక్టోరల్ అధికారులకు ఈవీఎంలపై శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. అలాగే ఈనెల 5వ తేదీ మంగళవారం చిత్తూరు జెడ్పీ మీటింగ్ హాలులో ఎలక్షన్ సిజర్స్ మేనేజ్ మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్)పై ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ టీమ్ సభ్యులకు, చెక్‌పోస్ట్ సిబ్బంది, సబ్ సిబ్బంది ఎన్నికల్లో నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై శిక్షణ ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం 12 గంటలకు కమిషనర్, ఆర్వో, ఎంపీడీఓలు, తహసీల్దార్లకు ఎన్నికలపై శిక్షణ సమావేశం జరుగుతుందని తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 2 గంటలకు పోస్టల్ బ్యాలెట్ అండ్ హోమ్ ఓటింగ్‌పై అడిషనల్ మైక్రో అబ్జర్వర్లు, ఆర్వో, ఏఆర్వోలు, కమిషనర్, ఎంపీడీఓలు, హెచ్ఎస్ఓలకు శిక్షణ సమావేశం జరుగుతుందని చెప్పారు.

ఆర్థిక అక్షరాస్యత అవసరం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపల్

నగరి: విద్యార్థి దశలోనే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ డా. భాస్కరరాజు అన్నారు. శనివారం కళాశాల, వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ (విడ్స్) స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఆర్థిక అక్షరాస్యత, అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్నివర్గాలను ఆర్థిక అభివృద్ధిలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా నేటి ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. ఆర్థిక ఫలాలు అన్ని వర్గాలకు లభించాలంటే వాటిని ఉపయోగించుకునే అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డా.భాస్కర్, డాక్టర్ సుహాసిని, మునికుమారి, లాల్‌బాషా, విడ్స్ విజయపురం మండల కోఆర్డినేటర్ అంగముత్తు పాల్గొన్నారు.

గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



సుధీర్(ఫైల్)

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని జెడ్పీ రిటైర్డ్ సీఈఓ సుధాకర్ పిళ్లై కుమారుడైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సుధీర్ (40) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబసభ్యుల కథనం మేరకు.. గంగాధరనెల్లూరుకు చెందిన సుధీర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన వృత్తి రీత్యా బెంగళూరులో నివాసం ఉన్నాడు. వర్క్‌ఫ్రమ్ హోమ్‌లో భాగంగా ఇంట్లోనే అర్ధరాత్రి వరకు విధులు నిర్వహించాడు. అనంతరం నిద్రిస్తుండగా ఒక్కసారిగా గుండె పోటు వచ్చి, మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

నా బిడ్డను ఆశీర్వదించండి



ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, జీడీ నెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మితో నేతలు

వెదురుకుప్పం: 'నా బిడ్డను మీ బిడ్డగా అక్కున చేర్చుకుని ఆశీర్వదించండి..పేద కుటుంబానికి చెందిన నన్ను అక్కున చేర్చుకుని ఆదరించిన వైఎస్సార్ కుటుంబానికి జన్మాంతం రుణపడి ఉంటాను. అణగారిన వర్గానికి చెందిన నాకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి, గుర్తింపు తీసుకొచ్చిన సీఎం జగనన్నకు నేను ఏమిచ్చినా ఆయన రుణం తీర్చుకోలేను.' అని ఉపముఖ్యమంత్రి కే.నారాయణస్వామి అన్నారు. నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మిని వైఎస్సార్‌సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంతో శనివారం పుత్తూరు క్యాంపు కార్యాలయంలో ఆరు మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున వచ్చి కృపాలక్ష్మిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా తనకు అవకాశమిచ్చి 2024లో కూడా తన కుమార్తె కృపాలక్ష్మిని సమన్వయకర్తగా నియమించిన సీఎం జగనన్నకు పేదవారిపై ఉన్న మమకారం, ఆప్యాయతను మరోసారి నిరూపించుకున్నారని చెప్పారు. పేదలు మరింత అభ్యున్నతి సాధించాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. తన ఊపిరి ఉన్నంత వరకూ తమను నమ్ముకున్న వారికి చేదోడుగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఏ ఒక్కరికీ అన్యాయం చేయలేదని, భవిష్యత్తులో కూడా వైఎస్సార్ కుటుంబానికి కళంకం తెచ్చేలా నడుచుకోబోమని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా చెప్పారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఉపాధ్యక్షుడు రామయ్య, గృహసారథుల కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం, స్టీరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు శివాజీ, వైస్ ఎంపీపీ విజయ, ఎంపీటీసీ సభ్యుడు తోకల మురళీరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, సర్పంచ్ గోవిందయ్య, యువత మండల అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోకు ఏర్పాట్లు పూర్తి



పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



వెదురుకుప్పం: ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



నింద్ర: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

పాలసముద్రం : మండలంలో ఆదివారం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పల్స్‌పోలియో కోసం మండలంలోని అన్ని గ్రామాల్లో 19 కేంద్రాలు ఏర్పాటు చేసి, 76 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందికి బాధ్యతలు అప్పగించామని చెప్పారు. మొత్తం రెండు రూట్లుగా విభజించి ఇద్దరు సూపర్‌వైజర్లను పర్యవేక్షణకు నియమించామన్నారు. ఒక మొబైల్ టీమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలియో చుక్కలు వేస్తారని, ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. మండలంలో 2,767 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారని వీరందరికీ పోలియో చుక్కలు వేసి, నూరు శాతం నమోదు చేసేందుకు కృషిచేస్తున్నామన్నారు. పీహెచ్‌సీ కమిటీ చెర్మన్ ఎస్ శివప్రకాష్‌రాజు మాట్లాడుతూ ఆదివారం పోలియో చుక్కలు వేసుకోని పిల్లలకు సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. అనంతరం పాలసముద్రం ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలి

వెదురుకుప్పం: పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి సురేఖ అన్నారు. శనివారం మండలంలోని పచ్చికాపల్లం, వెదురుకుప్పంలో పల్స్ పోలియోపై ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఆదివారం మండలంలో జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు గీత, సుమతి, సిబ్బంది పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

నింద్ర: ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కోరుతూ నింద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది శనివారం స్థానికంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ గోపి, సీహెచ్ఓ శ్రీదేవి, సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వాధికారులకు సహకరించండి



కోట దళితవాడ వాసులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరమణారెడ్డి

కార్వేటినగరం: ప్రభుత్వాధికారులకు ప్రజలు సహకరిస్తే, వారికి న్యాయం చేస్తామని నగరి ఆర్డీఓ వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయం, డిగ్రీ కళాశాల ఆవరణలో నివాసాలున్న వారితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. కళాశాల నిర్మాణం కోసం సుమారు 20 ఏళ్ల క్రితం ఆ స్థలాన్ని ప్రభుత్వం విద్యాశాఖకు అప్పగించిందని, అందులో కళాశాల నిర్మించారన్నారు. కళాశాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టిందని చెప్పారు. అయితే కళాశాలకు కేటాయించి స్థలంలో స్థానికులు ఇళ్లు నిర్మించడంతో ప్రహరీ నిర్మాణానికి ఆటంకం కలుగుతుందన్నారు. మీరు ప్రభుత్వాధికారులకు సహకరించి, వెంటనే గుడిసెలను తొలగించాలని సూచించారు. అధికారులకు సహకరించిన వారికి వెంటనే కళాశాల సమీపంలో ఉన్న స్థలాన్ని చదును చేసి పట్టాలు మంజూరు చేస్తామని, ఆ స్థలం వద్దనుకున్నా పచ్చికాపల్లం రోడ్డులో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ఇళ్లు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయంగా ఇంటి పట్టాలు ఇచ్చి, పక్కాగృహాలు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వాధికారుల మాటలను పెడచెవిన పెట్టి ఖాళీ చేయని వారిపై కేసు నమోదు చేసి, బలవంతంగా తొలగిస్తామని హెచ్చరించారు. అధికారులు ఇచ్చిన గడువులోపు స్థలాన్ని ఖాళీ చేయాలని కోట దళితవాడ గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, తహసీల్దార్ పుష్పకుమారి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయులురెడ్డి పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా సభలు నిర్వహించకూడదు



మాట్లాడుతున్న డీఎస్పీ


నగరి: నగరి సబ్‌డివిజన్ పరిధిలో పోలీస్ యాక్ట్ 1861 సెక్షన్ 30, 30(ఎ) అమల్లో ఉందని అనుమతులు లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, బహిరంగ సభలు నిర్వహించకూడదని డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈనెల 31వ తేదీ వరకు నగరి డివిజన్ పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు చేశామన్నారు. ర్యాలీలు, బహిరంగ సభ, మైక్‌సెట్లు లాంటివి ఏర్పాటుచేయదలచిన వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతి కోసం దరఖాస్తు చేసుకునేవారు బహిరంగసభ జరిగే తేదీ, సమయం, స్థలం, మార్గపు వివరాలు పేర్కొనాలన్నారు. అనుమతులు తీసుకున్నవారు మహిళల శాంతి భద్రతలకు, సంస్కృతి నాగరికత విలువలకు విఘాతం కలిగించేలా, పరీక్షలు రాసే విద్యార్థులకు ఆటకం కలిగించేలా ఉంటే అనుమతులు రద్దుచేస్తామని తెలిపారు. 30 యాక్ట్‌ను ఉల్లంఘించి సమావేశాలు, ర్యాలీలు నిర్వహించినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నిబంధనలు వివాహ ఊరేగింపులకు, అంతిమయాత్రలకు వర్తించదన్నారు. పళ్లిపట్టు రోడ్డులో ఎక్కువగా పాఠశాలలు, ఆస్పత్రులు ఉన్నందున పరీక్షలకు విద్యార్థులు ఎక్కువగా హాజరవుతున్నందున ఉదయం 9 గంటల వరకు ఆ మార్గంలో టిప్పర్ లారీలు వెళ్లకుండా చూస్తామన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి



హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

- సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: యువత, పిల్లలు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ.రాఘవేంద్ర అన్నారు. శనివారం స్థానిక గేట్ పుత్తూరులోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం నేర ప్రవృత్తిని ప్రేరేపిస్తుందని తెలిపారు. మత్తుపదార్థాలకు బానిసైతే విలువైన జీవితం ఛిద్రం అవుతుందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యతని, ఇందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. అలాగే లైంగిక వేధింపులను నిర్మూలించాలని, స్త్రీలను గౌరవించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలని, ఫాస్ట్‌ఫుడ్ జోలికి కూడదని చెప్పారు. ఫాస్ట్‌ఫుడ్ తీసుకోవడం ద్వారా కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని తెలిపారు. మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రజలు తమ వంతు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పిల్లలు ఎప్పుడూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పరిరక్షణలో ఉండాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని అధిరోహించాలని సూచించారు. నేటి సమాజంలో విద్యకు మించిన సంపద మరొకటి లేదన్నారు. చదువుమీదే దృష్టి సారించాలని ఈ క్రమంలో ఎలాంటి వ్యామోహాలకు లోనుకాకూడదని సూచించారు. 18 ఏళ్లు నిండేంతర వరకు వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. ఎంఈఓ బాలసుబ్రమణ్యం, ఎస్ఐ.వెంకటమోహన్, హెచ్ఎం వేములు, పీడీ జయదేవ్ పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా జగనన్న





ఆర్బీకేను ప్రారంభిస్తున్న మంత్రి రోజా (ఇన్‌సెట్) జగనన్న పాల వెల్లువ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా

- ఆర్బీకే, బల్క్‌మిల్క్ సెంటర్ల ప్రారంభోత్సవంలో మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: అన్నదాతకు కొండంత అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక యువజన క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. శనివారం పత్తిపుత్తూరులో జగనన్న పాల వెల్లువ, అయ్యన్నగారి పల్లిలో రైతు భరోసా కేంద్రాల నూతన భవనాలను మంత్రి రోజా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం జగనన్న ఆర్బీకే వ్యవస్థ ద్వారా వ్యవసాయాన్ని పండుగగా మార్చేశారని అన్నారు. చంద్రబాబు తాను అధికారంలో ఉండగా వ్యవసాయం దండగా అంటూ రైతులను అవమానించారని గుర్తుచేశారు. అయితే నేడు ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగులమందులు, వ్యవసాయ పరికరాలను సైతం సబ్సిడీతో ఇంటి ముంగిటే అందిస్తున్నామని చెప్పారు. అలాగే జగనన్న పాల వెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా ఆదుకుంటున్నట్లు తెలిపారు. అందరికీ మంచి చేస్తున్న జగనన్న మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రమేష్‌రాజు, తహసీల్దార్ రాజసింహనరేంద్ర, ఎంపీడీఓ సుజాతమ్మ, గ్రామ సర్పంచ్ తులసి, ఎంపీటీసీ ప్రతిమ, ఎంపీపీ విజయలక్ష్మి, నేతలు సుధీర్ రెడ్డి, కరుణాకర్‌చౌదరి, సుబ్రమణ్యంరెడ్డి, సునీల్‌రెడ్డి, రవిరెడ్డి, కే శివులురెడ్డి, మునిబాబు, ఉమాపతి, యాదవేంద్రరెడ్డి, చంద్రారెడ్డి, సురేష్‌రాజు, కిరణ్, చైతన్య, లోకేష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పీఓపీ పథకంలో మహిళకు ఆటో



మహిళకు ఆటోను అందజేస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి: మండలంలోని దామరపాకం దళితవాడలోని ఇందిరమ్మ ఎస్‌హెచ్‌జీ గ్రూపునకు చెందిన మౌనికకు సెర్ప్ విభాగం ద్వారా పీఓపీ (పూర్ ఆఫ్ పూర్) పథకంలో ఆటోను అందించారు. శనివారం మహిళకు ఆటోను మంత్రి ఆర్కేరోజా అందజేశారు. ఈ సందర్భంగా సెర్ప్ అధికారులు మాట్లాడుతూ పీఓపీ పథకంలో రూ.3,01,472 వడ్డీలేని రుణం అందించామన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, సెర్ప్ అధికారులు పాల్గొన్నారు.

లోక రక్షకుడు ఏసుప్రభు



బిషఫ్‌ను సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : ఏసు ప్రభువు లోకరక్షకుడని, ఆయన ప్రపంచ శాంతి స్థాపనకు కృషిచేసిన గొప్ప దేవుడని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. చిన్నతయ్యూరు సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆనకట్టు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏసు జననం ఈ సృష్టికి ఓ శాంతి సందేశమని అన్నారు. ఏసుప్రభు బాటలోనే సీఎం జగన్‌మోహన్ రెడ్డి కుల, మత, వర్గ, రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ఉన్నత వర్గాలతో సమానంగా పేదవారు జీవించాలంటే ప్రతి పేద కుటుంబం నుంచి ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలన్నారు. ఇది జరగాలంటే జగనన్నతోనే సాధ్యమన్నారు. అనంతరం బిషఫ్‌లు, పాస్టర్లు డిప్యూటీ సీఎం నారాయణస్వామి సన్మానించారు. బిషఫ్ డాక్టర్ రెబెన్‌మార్క్, ప్రిస్లీ, జయశీలన్, ఆగస్టీన్, శామ్యూల్, జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ సరిత, మండల కన్వీనర్ మణి, సర్పంచ్ వరదమ్మ, నేతలు బాబు, జనార్దన్, కుప్పయ్య, హరి, సుకుమార్ పాల్గొన్నారు.

పరామర్శ..


గంగాధర నెల్లూరు: అనారోగ్యంతో బాధపడుతున్న కొత్త వెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు బాబు నాయుడిని డిప్యూటీ సీఎం నారాయణస్వామి శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనారోగ్యం బారిన పడి, చికిత్స చేయించుకుని కోలుకుంటున్న ఆయన్ని శనివారం కొత్త వెంకటాపురంలోని నివాసానికి వెళ్లి పరామర్శించారు. అలాగే మాజీ ఎంపీపీ ప్రగతి భర్త కరుణాకర్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

సూక్ష్మపోషకాలతో మంచి దిగుబడి

పాలసముద్రం : రైతులు తమ పంటలకు సూక్ష్మపోషకాలు సరైన మోతాదులో వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు.

శనివారం పాలసముద్రం సచివాలయ ఆవరణలో వ్యవసాయ సహాయకులు మధు, వనజ, రైతులకు సూక్ష్మ పోషకాల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల దిగుబడులను సుస్థిరపరచడానికి రైతులు సూక్ష్మపోషకాల ఆవశ్యకతపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన అవసరం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో బ్యాంకర్లు, అధ్యాపకులు

కార్వేటినగరం: బ్యాంకుల్లో జరిగే ఆర్థిక లావాదేవీలు, నగదు డిపాజిట్లు, రుణాల వంటి వాటిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఇండియన్ బ్యాంకు మేనేజర్ రోహిత్ అన్నారు. బ్యాంకు ఆర్థిక లావాదేవీల వారోత్సవాల్లో భాగంగా శనివారం కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు అన్ని వర్గాలు, అన్ని రంగాల వారికి ఉపయోగపడే వనరుగా అభివృద్ధి చెందుతుందని, నగదు రహిత లావాదేవీలు సైతం బ్యాంకుల్లోనే జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ఆర్థిక వనరులపై అవగాహన కల్పించేందుకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.4 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 వేలు అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 500 వంతున చిత్తూరు లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్ ద్వారా అందజేశారు. అధ్యాపకులు బాలసుబ్రమణ్యం చౌదరి, సుబ్బారావు, హరిబాబు, కార్తిక్, ప్రసాద్, లావణ్య పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



సంపద తయారీ కేంద్రంలో వర్మికం పోస్టును పరిశీలిస్తున్న డీపీఓ లక్ష్మి

పాలసముద్రం : గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, చెత్త నుంచి సంపద తయారు చేసి పంచాయతీ ఆదాయం పెంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)లక్ష్మి తెలిపారు. శనివారం శ్రీకావేరిరాజుపురం సచివాలయం, చెత్త సేకరణ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ చెత్త సేకరణతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కారంతోపాటు చెత్త నుంచి సంపద తయారు చేస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందన్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి, సంపద తయారీ కేంద్రానికి తరలించి, వర్మికంపోస్టు తయారు చేసి, రైతులకు తక్కువ ధరకు విక్రయించాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం ఏర్పడితే ఊరుకోబోమని అన్నారు. మండలంలోని వీధిలైట్ల ఏర్పాటును కూడా పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి రాజీవ్ కుమార్ పాల్గొన్నారు.